తవక్లాపూర్‌లో తాగునీటి గోస

- గ్రామంలో సరఫరా కాని భగీరథ నీరు
- ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన



నీరు రావడం లేదని ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

డిండి: ఎండలు ముదరకముందే డిండి మండలంలోని తవక్లాపూర్ గ్రామ ప్రజలకు తాగునీటి గోస ఎదురవుతోంది. గ్రామంలోని పెద్దమ్మ కాలనీలో ఉంటున్న 50కి పైగా కుటుంబాలకు దాదాపు నెల రోజుల నుంచి మిషన్ భగీరథ పథకం ద్వారా నీరు సరఫరా కాకపోవడతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలోని జనాభా సంఖ్యకు అనుగుణంగా మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా.. తాగునీటి సమస్యను పరిష్కరించాలని శనివారం కాలనీకి చెందిన కొప్పుల సైదమ్మ, దండోట్కార్ లక్ష్మీబాయి, మధనమోని హరిత, ఎండీ. రఫియా, కదారి వెంకటమ్మ, మైమూదా, అనూష, యశోధ, బాలమ్మ, సులోచన ఖాళీ బిందెలతో ఆందోళన వ్యక్తం చేశారు. తాగు నీరు రాకపోవడంతో ప్రైవేట్‌గా మినరల్ వాటర్‌ను కొనాల్సి వస్తోందని పేర్కొన్నారు.

కొనుగోలు చేయాల్సి వస్తోంది



మా గ్రామంలో మిషన్ భగీరథ నీరు ప్రతిరోజు సరఫరా కాకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్‌గా మినరల్ వాటర్‌ను కొనుగోలు చేయాల్సి వస్తోంది.

– కదారి రేణమ్మ

పట్టించుకోవడం లేదు



తవక్లాపూర్ గ్రామంలో దాదాపు నెల రోజుల నుంచి తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ విషయంపై సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటిని అందించేలా చూడాలి.

– ఎనమల నవీన్

మరమ్మతులు చేయించాలని ఆదేశించాం

గ్రామంలో మరమ్మతులకు గురైన బోరు మోటార్‌ను బాగు చేయించాలని గ్రామ కార్యదర్శికి ఇప్పటికే సూచించాం. తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడతాం.

– వెంకన్న, ఎంపీడీఓ, డిండి

వైభవంగా అష్టలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణ సమీపంలోని రైల్వే కాలనీలో గల శ్రీ సాయిదత్తాశ్రమం ఆవరణలో శనివారం అష్టలక్ష్మి మందిరం 11వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అజయ్ పాఠక్, అజయ్ త్రిపాటీలు వేదమంత్రాలతో శ్రీఆదిలక్ష్మీనారాయణుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. ఆలయంలో స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గుండా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి మట్టయ్య, జానకిరాముడు, విక్రం, వాసు, అంజిబాబు, రవి, పద్మ, భాగ్యలక్ష్మి, శారద, కళ్యాణి, అరుణ, సుకన్య, భక్తులు ఉన్నారు.

జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపంగా నిలుస్తాయని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. అనుముల మండలంలోని మారేపల్లిలో శ్రీలక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా దేవాలయ కమిటీ నిర్వాహకుల ఆహ్వానం మేరకు శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎడ్ల పందేలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ కోటిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది హారూర్ అంజాద్ ఖాన్, నాయకులు అనుముల యాదయ్య, మారేపల్లి క్రాంతి, ఏడుకొండలు, భిక్షపతి, యాదయ్య, దేవాలయ చైర్మన్ శ్రీను, బీమా నాయక్, వెంకటయ్య, దుర్గశంకర్, నాగరాజు పాల్గొన్నారు.

ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి చేయాలి



సీపీఐ కార్యాలయంలో...

దేవరకొండ: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం దేవరకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ధర్మభిక్షం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో దేప సుదర్శన్‌రెడ్డి, నూనె రామస్వామి, వలమల్ల ఆంజనేయులు, జూలూరి వెంకట్రాములు, గంగిడి రాంరెడ్డి పాల్గొన్నారు.

తాటికోల్‌లో..

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ధర్మభిక్షం జయంతిని శనివారం దేవరకొండ మండలం తాటికోల్‌లో గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ గీత సంఘాల సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్.. ధర్మభిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వరికుప్పల శ్రీను, చలమల్ల విజయ్, లక్ష్మీనారాయణ, పాలకుర్ల లింగయ్య, జూలూరి ఎల్లయ్య, హన్మంతు పాల్గొన్నారు.

మలబార్‌లో బ్రైడల్ జ్యూవెలరీ షో



బ్రైడల్ జ్యూవెలరీ షోను ప్రారంభిస్తున్న మహిళలు

మిర్యాలగూడ : పట్టణంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో నూతన వధూవరుల అభిరుచికి తగ్గట్లుగా అనేక రకాల మోడల్స్‌తో బ్రైడల్ జ్యూవెలరీ షోను శనివారం ప్రారంభించారు. ఈ బ్రైడల్ జ్యూవెలరీ షో ఈనెల 15 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు స్టోర్ హెడ్ సమీర్ తెలిపారు. కస్టమర్లకు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మన్నికైన నగలు అందిస్తుందని తెలిపారు. జ్యూవెలరీ షోను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సమీర్ కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సంపత్, కవిత, అనూష, ప్రవళిక, మాధురి, సౌందర్య, శ్వేత ఉన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి : ఈనెల 19, 20 తేదీల్లో నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో జరిగే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్ కోరారు. శనివారం కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభల వాల్ పోస్టర్‌ను యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాసచారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌నాయక్ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఈ సభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుడిగ వెంకటేష్, జై చరణ్, సురేష్, రాము, దాసు, మల్లేష్, రాజు, పావని, మంజుల, రోజా, నందిని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

హాలియా : రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటాలను ఉధృతం చేస్తామని ఎస్‌ఎఫ్‌ఐ సాగర్ నియోజకవర్గ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు అన్నారు. శనివారం హాలియా పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అనుముల మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలకు సొంత భవనం లేక విద్యార్థులు అద్దె భవనంలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 19, 20వ తేదీలలో నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే జిల్లా మహాసభలలో సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా నాగరాజు, బుడిగపాక వర్షిత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, అజయ్, దుర్గప్రసాద్, శివాని, మధుప్రియ, నవీన్ పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ అడుగుజాడల్లో నడవాలి



మిర్యాలగూడ : సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



మిర్యాలగూడ టౌన్ : జప్తీవీరప్పగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

మిర్యాలగూడ : గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. శనివారం మిర్యాలగూడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సంత్‌సేవాలాల్ 286వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి భాస్కర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.కార్యక్రమంలో చిట్టిబాబునాయక్, హతీరాంనాయక్, సేవ్యానాయక్, లలిత, శంకర్‌నాయక్, శ్రీను, వినోద్ నాయక్, సాక్రంనాయక్, శ్రీను, షోయబ్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో కొండమల్లేపల్లిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అంతకుముందు బంజారా భవన్ దగ్గర భోగ్ భండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, దేవరకొండ మార్కెట్‌కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, నాయకులు వేమన్‌రెడ్డి, బక్కులు, బూడిద మల్లేష్‌యాదవ్, బంజారా మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డు సభ్యులు, బంజారా నాయకులు, బావోజీలు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం జప్తీవీరప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.శిరీష పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.మాధవి, గుడిపాటి కోటయ్య, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకళ, రామ్, రవి, రేణుక తదితరులున్నారు.

ఎంఈఓ కార్యాలయంలో..

పట్టణంలోని ఈదులగూడెంలో గల ఎమ్మార్సీ భవనంలో శనివారం సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంఈఓలు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీఓ శేషగిరిశర్మ, రమేష్, ఎంఈవోలు బాలునాయక్, బాలాజీనాయక్, వెంకన్న, లక్ష్మణ్‌నాయక్, చత్రునాయక్, ఏఈ వరలక్ష్మి తదితరులున్నారు.

పెద్దవూర : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోగ్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్‌ఎం డి.బాలోజీ, ఉపాధ్యాయులు సంధ్య, ఎండీ.షబ్బీర్, డి.శ్రీనునాయక్, రామయ్య, షాహిన్‌బేగం, జ్యోతి, సిబ్బంది నాగేందర్, రాము, చిన్న తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : మండలంలోని దేన్యతండా గ్రామంలో బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి బంజారా పెద్దలు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేన్యతండా గ్రామ శాఖ అధ్యక్షుడు రామవత్ శ్రీనివాస్‌నాయక్, రామావత్ హరినాయక్, మోత్యానాయక్, బగ్గు, రామావత్ నగేష్ నాయక్, ధర్మానాయక్, జగన్‌నాయక్, బాసు నాయక్, హనుమాన్ నాయక్, హేమ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను శనివారం దేవరకొండలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు పూలమాలలు వేసి మాట్లాడారు. కార్యక్రమంలో వేముల రాజు, రమావత్ రమేష్, నీల కుమార్, బొడ్డుపల్లి కృష్ణ, రమావత్ తులసీరాం, మధు, చంద్రమౌళి ఉన్నారు.

స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో..

సేవాలాల్ మహారాజ్ జయంతిని శనివారం స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌పీటీ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తాళ్ల శ్రీధర్‌గౌడ్, ఉమా మహేశ్వర్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, శ్రీను, శ్రీనయ్య, చంద్రశేఖర్, జగన్, తదితరులున్నారు.

పద్మశాలీలను తక్కువ చూపడం సరికాదు

మిర్యాలగూడ టౌన్ : సమగ్ర కుటుంబ సర్వేలో పద్మశాలీలను తక్కువ సంఖ్యగా చూపించడం సరికాదని మిర్యాలగూడ బీసీ జేఏసీ కన్వీనర్ మారం శ్రీనివాస్ అన్నారు. శనివారం మిర్యాలగూడలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వెల్లడిస్తే పద్మశాలీలు 15 నుంచి 16లక్షల మందికి పైగానే ఉంటారని అన్నారు. ప్రభుత్వం రీ సర్వే చేయించడం సంతోషకరమని, పద్మశాలీలు ఈ సర్వేలో నమోదు చేయించుకోవాలన్నారు. సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్ల శ్రీనివాస్, యోశాల విశ్వకుమార్, గజ్జి వెంకటేశం తదితరులు ఉన్నారు.

డిక్లరేషన్‌ను అమలు చేయాలి

మిర్యాలగూడ టౌన్ : దళితుల అభివృద్ధి కోసం చేవెళ్లలో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రకటించిన అంబేద్కర్ అభయ హస్తం ద్వారా ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం వెంటనే అందించాలన్నారు. అనంతరం కేవీపీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మిర్యాలగూడ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డబ్బికార్ మల్లేష్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రెమడాల పరశురాములు, పాదూరి శశిధర్‌రెడ్డి, కోడిరెక్క రాధిక, కోడిరెక్క మల్లయ్య, దేవయ్య, జనార్దన్, పాపారావు, వెంకన్న, తదితరులున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలి



శాఖాపురంలో హెల్త్ సర్వే నిర్వహిస్తున్న సురేష్

త్రిపురారం : ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలని డిస్ట్రిక్ జూనియర్ నేషనల్ స్టాటికల్ అధికారి సురేష్ సుంకరి అన్నారు. ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సర్వేలో భాగంగా నిడమనూరు మండలంలోని శాఖపురంలో శనివారం హెల్త్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలు ఏ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఏ ఆస్పత్రుల్లో ఏం ఇబ్బందులు పడుతున్నారు తదితర అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన వేడుకలో విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు



పెద్దవూర : వెల్మగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

హాలియా : పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిమ్మల లక్ష్మారెడ్డి బహుమతులను అందజేశారు.

వీఎస్సార్ హైస్కూల్‌లో..

స్థానిక వీఎస్సార్ హైస్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ శివర్ల వెంకటయ్య బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దవూర : మండలంలోని వెల్మగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు, దాతలు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు వసంతకుమార్, హిమవంతరెడ్డి, రామకృష్ణారెడ్డి, గుంటుక రామాంజిరెడ్డి, సమత, శకుంతల, వెంకటయ్య, పీడీ నిమ్మల లెనిన్‌బాబు, అయేషా, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మీసురేందర్ పాల్గొన్నారు.

వేములపల్లి(మాడ్గులపల్లి) : మాడ్గులపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకటమ్మ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, వినోద, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాములు, శోభారాణి, ఇస్మాయిల్, భాగ్యవతి, ఉన్నారు.

త్రిపురారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, దాతలు ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవి కుమార్, ఉపాధ్యాయులు వీరారెడ్డి, మెండె వెంకట్, పద్మ, శ్రీనయ్య, లక్ష్మీ, నర్సయ్య, వెంకన్న, శ్రీనివాస్, విష్ణు కుమార్, సైదా, జానకమ్మ, పద్మావతి, గీతారమణి, ఏడుకొండలు, సరోజ, కోటేశ్వరరావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీ మోడల్ స్కూల్‌లో..

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని వాసవీ నగర్‌లో గల ఎస్‌వీ మోడల్ స్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు.. అధికారుల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఓరుగంటి శ్యాంసుందర్, డైరెక్టర్ ఓరుగంటి విశాలాక్షి, ఇన్‌చార్జ్ నాగలక్ష్మి, ఆయేషా, సాధియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవావాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సముద్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



హాలియా : వీఎస్సార్ హైస్కూల్ ఉపాధ్యాయులతో విద్యార్థులు



త్రిపురారం జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

అరగుంట పొలం కూడా ఎండిపోవద్దు



మాట్లాడుతున్న ఏడీఏ మందడి సాగర్ రెడ్డి

గుర్రంపోడు : మండలంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా అరగుంట పొలం కూడా ఎండిపోవద్దని, విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏడీఈ మందడి సాగర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ఏఈ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండలు ముదురుతున్నందున లైన్ ట్రిప్ వంటి సమస్యలకు ముందే చెక్ పెట్టాలని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై ఫ్యూజులు, జంపర్లు తెగిపోతే వెంటనే స్పందించాలని తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ ఏఈ శ్రీకాంత్ రెడ్డి, లైన్‌మెన్‌లు, జేఎల్‌ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కొండమల్లేపల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొండమల్లేపల్లి పట్టణంలో శనివారం రాత్రి జరిగింది. కొండమల్లేపల్లిలోని హైదరాబాద్ రోడ్డులో గల జంగాల కాలనీకి చెందిన కడమంచి శ్రీకాంత్ తన ద్విచక్ర వాహనంపై అంగోతు హరిచంద్‌ను మండల పరిధిలోని అంగోతుతండాలో దించేందుకు వెళ్తున్నాడు. చింతపల్లి నుంచి ఖాదర్ పాషా అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై దేవరకొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీకాంత్ చేతికి గాయా కాగా ఖాదర్‌పాషా కాలుకు గాయం అయ్యింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

వేతన బకాయిలు చెల్లించాలని వినతి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మిర్యాలగూడ : మున్సిపల్ కార్మికుల వేతన బకాయిలు అందించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు తిరుపతి రామ్మూర్తి కోరారు. ఈమేరకు శనివారం మిర్యాగూడలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి మున్సిపల్ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు 2021లో గత ప్రభుత్వం వేతనాలు పెంచిందని, అప్పటి నుంచి 2023 వరకు వేతనాలు అందించలేదని తెలిపారు. అదేవిధంగా కార్మికులకు సబ్బులు, దుస్తులు, కొబ్బరి నూనె, చెప్పులు, షూ, గ్లౌజ్‌లు అందించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్.వెంకన్న, మోహన్‌నాయక్, అబ్రహం, కళావతి, వెంకన్న, లింగయ్య, విజయలక్ష్మి, కోటయ్య, సుశీల తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



వైద్యం శిబిరం వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : ఈనెల 17వ తేదీన మాజీ సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ యువనేత నల్లమోతు సిద్ధార్థ జన్మదినం సందర్భంగా మిర్యాలగూడ మండలంలోని బి.అన్నారం గ్రామంలో అపోలో రీచ్ ఆస్పత్రి సహకారంతో కేవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఉచిత వైద్య శిబిరం వాల్ పోస్టర్‌ను శనివారం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సైదులు, సింగం సత్యనారాయణ, షోయబ్, ఉమాకాంత్‌రెడ్డి, వైద్య శిబిరం నిర్వాహకుడు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్‌లో సమాచారం ఇవ్వాలి

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఎక్కడైనా విపరీతంగా పక్షులు చనిపోయినట్లు గుర్తిస్తే వెంటనే పశు వైద్య, పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాట్సప్ నంబర్‌కు సమాచారం అందించాలని త్రిపురారం మండల పశు వైద్యాధికారి డాక్టర్ నాగేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9100797300 వాట్సప్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

19న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని నాయకునితండాలో ముత్యాలమ్మ తల్లి జాతర సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.40వేలు, రెండవ బహుమతి రూ. 30వేలు, మూడవ బహుమతి రూ. 20వేలు చెల్లించనున్నామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు రూ. 1099 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

త్రిపురారం : మండలంలోని కొణతాలపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ వెంకట్ రెడ్డి బంధువు లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి కొణతాలపల్లిలో మృతురాలు లక్ష్మమ్మ ఇంటికి వెళ్లి మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ జితేందర్ రెడ్డి, జొన్నలగడ్డ శేఖర్ రెడ్డి, జానయ్య, అమరేందర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెద్దవూర : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన శనివారం మండల పరిధిలో చోటు చేసుకుంది. మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన నడ్డి గోవింద్ తనకున్న గేదెలు, పశువులను తన పశువుల పాకలో కట్టేసి పడుకున్నాడు. శనివారం తెల్లవారుజామున గేదె మెడకు ఉన్న తాడును తెంచుకుని పాక సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ గేదెకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రమాదకరంగా ఏర్పాటు చేయడమే పశువుల మరణాలకు కారణమవుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మృతి చెందిన గేదె విలువ రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.